

నెల్లూరులో జరుగుతున్న సిపిఎం రాష్ట్ర మహాసభల్లో కార్యదర్శి నివేదికపై చర్చల్లో పాల్గొన్న జిల్లా కార్యదర్శి తమ్మినేని, కార్యదర్శివర్గ సభ్యులు

రిక్తహస్తం

టిడిపి మద్ధతుపైనే ఆధారపడిన కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం జిల్లాకు కొత్త ప్రాజెక్టులు, ఆగిపోయిన వెనుకబడిన ప్రాంత నిధులు, గిరిజన యూనివర్శిటీ భారీగా నిధులు కేటాయిస్తుందని ఆశించిన ఉమ్మడి జిల్లా ప్రజలకు నిరాశే మిగిలింది. కేంద్ర ఆర్ధికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టిన 2025-26 కేంద్ర బడ్జెట్‌లో జిల్లాకు మొంచి చేయి చూపింది. సాధారణ కేటాయింపులు మినహా ప్రత్యేకించి నిధులు, ప్రాజెక్టులేవీ లేకపోవడంతో అంతా పెదవి విరుస్తున్నారు. వెనుక బడిన ప్రాంతాలకు ఏడాదికి రూ.50 కోట్ల గ్రాంట్ ఇస్తామని గతేడాది జూలై బడ్జెట్‌లో చెప్పిన ప్రభుత్వం ఈ సారి అదీ కూడా లేదు. రాష్ట్ర విభజన సందర్భంగా జిల్లాలో ఏర్పాటు చేస్తామన్న గిరిజన యూనివర్శిటీకి ఇసుమంతైనా నిధులు కేటాయించకపోవడం పట్ల గిరిజనుల పట్ల బిజెపి ప్రభుత్వానికి ఎంత ప్రేమ ఉందో అర్ధమవుతోంది. జిల్లా కేంద్రాస్పత్రుల్లో కేన్సర్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించడంతో జిల్లాలో రోగులకు ఉపశమనం కలగనుంది. ఐదేళ్లలో 75వేల సీట్లు పెంచుతున్నట్లు ప్రకటించడంతో జిల్లాలోని మెడికల్ కళాశాలల్లో సీట్లు పెరగనున్నాయి. దీంతో మరింత మంది వైద్య విద్యను అభ్యసించేందుకు అవకాశం కలగనుంది. కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా ఆదివారం జిల్లా వ్యాప్తంగా మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ పిలుపునిచ్చారు.



- బడ్జెట్‌లో విజయనగరంపై శీతకన్ను
- ఊసేలేని గిరిజన యూనివర్సిటీ
- జిల్లా కేంద్రాస్పత్రిలో కేన్సర్ సెంటర్
- నేడు మండల కేంద్రాల్లో నిరసనలు : సిపిఎం

ప్రజాశక్తి-విజయనగరం కోట/టౌన్

జిల్లాలో తలపెట్టిన కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయానికి నిధులు కేటాయింపులో మొండిచేయే చూపారు. ఈ బడ్జెట్ సమావేశంలోనైనా నిధులు కేటాయిస్తారని ఆశగా ఎదురు చూసినవారికి నిరాశే ఎదురైంది. గిరిజన యూనివర్సిటీకి ఏటా అరకొర కేటాయింపులే జరుగుతున్నాయి. ఈసారి అది కూడా లేకపోవడంతో జిల్లా ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిధులు లేక పనులు నత్తనడకన సాగుతున్నాయి. సరైన భవనాలు లేక తరగుతులు కూడా పరాయి పంచన నిర్వహించాల్సి వస్తోంది. మరడాం-మెంటాడ మండలం కుంటినవలస గ్రామాల పరిధిలో 560 ఎకరాలను వర్సిటీకి కేటాయించారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి విశ్వ విద్యాలయాన్ని ఈ క్యాంపస్ నుంచే నిర్వహిం చేందుకు కేంద్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. 2027 నాటికి పూర్తి స్థాయిలో భవనాలను అందు బాటులోకి తీసుకురావాలని భావిస్తున్నారు. నిధులపై స్పష్టత లేకపోవడంతో పనులు ఎంత వరకు ముందుకు కదులుతాయన్నది సందిగ్ధమే.

ఉమ్మడి జిల్లాలో 2.60లక్షల మంది రైతులు ఖరీఫ్, రబీ సీజన్‌లో కలిపి 4.80లక్షల ఎకరాలు సాగు చేస్తున్నారు. అధికా రంలోకి వస్తే స్వామినాధన్ కమిషన్ అమలు చేస్తామని 2014లోనే బిజెపి ప్రభుత్వం ప్రకటించినా ఇప్పటి వరకు అమలు కాలేదు. మద్ధతు ధరలకు గ్యారంటీ చట్టం చేయాలని రైతులు ఇప్పటికీ ఆందోళనలు సాగిస్తునా కేంద్ర ప్రభుత్వం దాని జోలికి వెళ్లలేదు. రైతులకు కిసాన్ సమ్మాన్ నిధిని మొత్తాన్ని ప్రభుత్వం పెంచనుందనే ప్రచారం సాగినా బడ్జెట్‌లో పెంపు ప్రస్తావన లేకపోవడంతో అన్నదాతలు నిరాశ చెందారు.

ప్రస్తావన లేని వెనుకబడిన ప్రాంతాల గ్రాంట్

విభజన చట్టంలో పేర్కొన మేరకు వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని ప్రకటించడం తప్ప, అమలుపై చిత్తశుద్ధితో మాట్లాడలేదు. గతంలోనూ ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని చెప్పినా అమలు కాలేదు. విభజన చట్టం ప్రకారం ఏటా రూ.50కోట్ల చొప్పున జిల్లాకు ఇవ్వవాల్సిన బిజెపి ప్రభుత్వం ఒకే ఒక్క సంవత్సరం ఇచ్చి ఆ తరువాత కేటాయించిన నిధులు కూడా వెనక్కి తీసుకుంది. ఈ లెక్కన ఉమ్మడి విజయనగరం జిల్లాకు రూ.64కోట్లు మించి అందలేదు. ఈ ఏడాది బడ్జెట్‌లో అదికూడా ప్రకటించలేదు.

జిల్లా కేంద్ర ఆసుపత్రికి కేన్సర్ సెంటర్

దేశ వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్ర ఆసుపత్రుల్లో కేన్సర్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు బడ్జెట్‌లో పేర్కొంది. దీంతో జిల్లా కేంద్రాస్పత్రిలో సెంటర్ ఏర్పాటు కానుంది. దీంతో కేన్సర్ పరీక్షలు, చికిత్స కోసం విశాఖతో పాటు జిల్లాలోని ప్రయివేట్ ఆసుపత్రులకు వెళ్లాల్సిన అవస్థలు తప్పనున్నాయి.

కొత్త పన్ను విధానంపై వేతన జీవుల పెదవి విరుపు

ఆదాయపు పన్ను పరిమితి విషయంలో ఉద్యోగులు ఆశించినంతగా ఊరట దక్కలేదు. ఉద్యోగులు పొందే మూల వేతనంలో 12 లక్షల వరకు ఆదాయం పొందుతున్న వారికి పన్ను మినహాయించినా పాత స్లాబ్‌లే కొనసాగించడంతో పెద్ద ఒరిగేదేమీ ఉండదని ఉద్యోగులు పెదవి విరుస్తున్నారు. కొత్త విధానం ప్రకారం రూ.4 లక్షల లోపు ఆదాయం పొందుతున్న వారికి పన్ను మినహాయింపు ఇస్తున్న నేపథ్యంలో దానిని మినహాయించి రూ.9.75 లక్షలకు ఆయా స్లాబ్‌ల ప్రకారం పన్ను మదింపు చేపట్టనున్నారు. ఉమ్మడి జిల్లాలో 25వేల మంది, ఉపాధ్యాయులు 9600 మంది, పెన్షనర్లు 20వేల మంది ఉండగా వారిలో 7వేల మంది వరకు ప్రయోజనం పొందవచ్చునని అంచనా.

ఎంఎస్ఎంఇల అభివృద్ధికి తోడ్పాటు

కేంద్ర బడ్జెట్‌లో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు పెద్దపీట వేయడం, పోలవరం ప్రాజెక్టు, విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ప్రత్యేకంగా నిధులు కేటాయించటం శుభపరిణామం. ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చే పది సూత్రాల్లో ఎంఎస్ఎంఇ రంగం ప్రధానమైంది. దేశ ఎగుమతుల్లో 45 శాతం వరకు ఎంఎస్ఎంఇల భాగస్వామ్యం ఉంటుంది. ఎంఎస్ఎంఇలకు వచ్చే ఐదేళ్లలో రూ.1.5 లక్షల కోట్లు కేటాయించడం, 27 రంగాల్లో స్టార్టప్‌లకు రుణాల కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించడం ఆహ్వానించదగ్గ పరిణామం. తొలి ఏడాది 10 లక్షలు నమోదు చేసుకున్న సూక్ష్మసంస్థలకు ఒక్కో సంస్థకు రూ.5 లక్షలతో క్రెడిట్ కార్డు ఇవ్వాలని నిర్ణయించటం ఆయా సంస్థల పురోభివృద్ధికి ఊతం ఇవ్వనుంది. బొమ్మల తయారీకి ప్రత్యేక ప్రోత్సాహకాలు ప్రకటిస్తూ కోట్లాది మందికి ఉపాధి అవకాశాలను కల్పించడం ద్వారా దేశ ఆర్థిక అభివృద్ధిలో ఇది ప్రధాన భూమిక పోషించనుంది.

- కొండపల్లి శ్రీనివాస్, చిన్నతరహా పరిశ్రమల శాఖా మంత్రి

జిల్లాకు ఒరిగింది శూన్యం

కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో జిల్లాకు సంబంధించి ఎటువంటి మేలు జరగలేదు. జిల్లా ప్రజల ఆశలను అడియాసలు చేసింది. జిల్లాలోని ప్రధానంగా వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి ప్యాకేజీ వంటి విభజన హామీలను పక్కన పెట్టింది. విభజన చట్టం ప్రకారం వచ్చిన గిరిజన యూనివర్శిటీకి నిధులు కేటాయించకపోవడం అన్యాయం. విశాఖ రైల్వే జోన్, విశాఖ నుంచి భోగాపురం వరకు మెట్రో రైలు లైన్లు వంటి వాటికి నిధులు లేవు. రైతులకు ఇచ్చే పిఎం కిసాన్ మొత్తాన్ని పెంచుతున్నట్లు ప్రకటించిన కేంద్రం ఆ ఊసే ఎత్తకపోవడం మోసం చేయడమే.

- తమ్మినేని సూర్యనారాయణ, సిపిఎం జిల్లా కార్యదర్శి

రాష్ట్రానికి చేసిందేమీ లేదు

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రవేశ పెడుతూ 'దేశమంటే మట్టికాదోయ్ దేశమంటే మనుషులే' అని గురజాడని తలుచుకోవడం తప్ప బడ్జెట్లో రాష్ట్రానికి మేలు చేసేదేమీ ప్రకటించ లేదు. రాష్ట్ర విభజన జరిగి పదేళ్ల దాటినా విభజన చట్టంలో ఉన్న అంశాల అమల్లో ఇప్పటికీ తీవ్ర నిర్లక్ష్యం కొనసాగుతోంది. రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఊసే లేదు. వెనకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలకు ప్రత్యేక నిధులు కేటాయించాలన్న డిమాండ్‌ను పట్టించుకోలేదు. విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ ప్రతిపాదన వెనక్కి తీసుకోలేదు. స్టీల్‌ప్లాంట్‌కి ప్రత్యేక గనులు కేటాయించాలని, సెయిల్‌లో విలీనం చేయాలని కార్మికులు చేస్తున్న డిమాండ్‌ను పెడచెవిన పెట్టారు. విశాఖపట్నం డివిజన్‌తో కూడిన రైల్వే జోన్ ఇవ్వాలని కోరితే, ఆ విషయం కూడా బడ్జెట్లో లేదు. ఢిల్లీ, బీహార్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని తయారు చేసిన బడ్జెట్‌లా ఇది కనిపిస్తోంది. ఆదాయ పన్ను శ్లాబుల్లో కొన్ని మార్పులు చేసి కొంత ఊరట కల్పించినా, ఉద్యోగులు కోరుకున్న విధంగా మాత్రం జరగలేదు. ఇన్సూరెన్సు రంగంలో ఎఫ్‌డిఐ పరిమితిని 74 నుండి 100 శాతానికి పెంచడం దేశ ఆర్థిక సార్వభౌమత్వానికి నష్ట చేసే చర్య.

- ఎం.శ్రీనివాస, ఆర్గనైజింగ్ సెక్రటరీ, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక

ఢిల్లీ, బీహార్ ఎన్నికల బడ్జెట్

ఢిల్లీ, బీహార్ ఎన్నికల్లో లాభ పడేందుకు కేంద్ర బడ్జెట్ రూపొందిం చినట్లు ఉంది. బడ్జెట్ సామాన్యులకు కాకుండా కార్పొరేట్లకు ఫుల్‌మీల్స్‌లా ఉంది. డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ వల్ల కాకినాడను కెమికల్ హబ్‌గా ప్రకటిస్తారనుకున్నాం. కానీ అంతా శూన్యంగానే ఉంది. ఈ బడ్జెట్‌ను చూసి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సిగ్గుపడాలి. ఆదాయపు పన్ను రాయితీ ఇచ్చినా, పెరిగే ధరల వల్ల మధ్యతరగతి వారి జేబులకు చిల్లు పడతాయి. ఉపాధి హామీ చట్టానికి నిధులు సరిగా కేటాయించలేదు.

- ఒమ్మి రమణ, సిపిఐ జిల్లా కార్యదర్శి

బీహార్‌కు వరాలు ఫుల్... ఆంధ్రాకు నిల్

కేంద్ర బడ్జెట్‌లో బీహార్‌కు వరాలిచ్చి, ఆంధ్రాకు మొండిచేయి చూపారు. బీహార్‌పై ఆధారపడి కేంద్రం పరిపాలన సాగిస్తుండటంతో నిధులు కేటాయించారు. ఉపాధి అవకాశాలు పెంచే మార్గాలు బడ్జెట్‌లో కనిపించలేదు. గిరిజన యూనివర్సిటీకి నిధులు కేటాయించక పోవడం సరికాదు. అధిక జనాభాగా ఉన్న వారికి బడ్జెట్ కేటాయింపుల్లో ఎటువంటి ఉపశమన చర్యలూ లేవు. ప్రధానంగా ధరలు తగ్గించే అవకాశం బడ్జెట్‌లో కనిపించడం లేదు.

- డివిజి శంకరరావు, రాష్ట్ర ఎస్‌టి కమిషన్ చైర్మన్

పోలవరానికి, విశాఖ స్టీల్‌కు పెద్దపీట

కేంద్రబడ్జెట్‌లో పోలవరానికి, విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు పెద్దపీట వేశారు. విశాఖ పోర్టుకు రూ.730 కోట్లు కేటాయించడం అభినందనీయం. పోర్టు వృద్ధితో విశాఖ మరింత అభివృద్ధి చెందుతుంది. రూ.12 లక్షల వరకు పన్ను మినహాయింపు ఇవ్వడం వల్ల పేద, మధ్యతరగతి కుటుంబాలకు మేలు చేకూరుతుంది.

- కిమిడి నాగార్జున, టిడిపి విజయనగరం పార్లమెంట్ అధ్యక్షులు

రాష్ట్రానికి అన్యాయం

కేంద్రం బడ్జెట్‌లో వ్యవసాయ, పారిశ్రామిక రంగాలకు కొన్ని సదుపాయాలు కల్పించారు. పన్నుల వల్ల కొన్ని వస్తువుల ధరలు పెరుగుతాయి. మన రాష్ట్రానికీ ప్రత్యేకంగా ఏ వరాలూ లేవు. ఆదాయపుపన్ను పరిమితిని రూ.12 లక్షల వరకు పెంచడం మధ్యతరగతికి ఊరట. బిజెపి ప్రభత్వం వచ్చిన తరువాత ఇదే కాస్తా ఊరట.

- కురిమినేని అప్పలనాయుడు, విశ్రాంత ప్రిన్సిపల్, ఆర్థిక వేత్త

జిల్లాకు మేలు లేదు

కేంద్ర బడ్జెట్‌తో జిల్లాకు పెద్దగా ఒరిగేది ఏమీ లేదు. గురజాడని తలుచుకోవడం తప్ప బడ్జెట్లో రాష్ట్రానికి మేలు చేసేది ఏమీ ప్రకటించలేదు. రాష్ట్ర విభజన జరిగి పదేళ్ల దాటిన తర్వాత కూడా విభజన చట్టంలోని అంశాల అమల్లో ఇప్పటికీ తీవ్ర నిర్లక్ష్యం కొనసాగుతోంది. ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలకు ప్రత్యేక నిధులు కేటాయించాలన్న డిమాండ్‌ను పట్టించుకోలేదు.

- మరిపి విద్యాసాగర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు

కీలకరంగాలకు మద్దతు

కేంద్ర బడ్జెట్ బాగుంది. ఆదాయపు పన్నులో భారీ మార్పులు చేసి మధ్యతరగతికి ఊరట కల్పించారు. పాత పన్ను విధానంతో పోల్చితే కొత్త విధానం చాలా సరళంగా ఉంది. కీలక రంగాలకు మద్దతు కలిగించేలా కేంద్రం బడ్జెట్‌ను రూపొందించారు. ఈ బడ్జెట్ వల్ల ఎఫ్ఎంసిజి, ఆటోమొబైల్, రియల్ ఎస్టేట్ వంటి రంగాలకు లబ్ధి చేకూరుతుంది.

- బేబినాయన, ఎమ్మెల్యే, బొబ్బిలి

మధ్యతరగతి ఊరట

కేంద్ర బడ్జెట్‌లో ఆదాయపు పన్ను పరిమితి పెంచడం ద్వారా మధ్యతరగతి ప్రజలకు ఊరట కలుగుతుంది. పన్ను మినహాయింపు ద్వారా వేతన జీవులకు మేలు. జిల్లాకు చెందిన మహాకవి గురజాడ అప్పారావు రచనలను లోక్‌సభలో ప్రస్తావించిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్‌కు కృతజ్ఞతలు..

- అవనాపు విక్రమ్, జనసేన నాయకులు

ఎన్నికల కోడ్ అమలుకు నోడల్ అధికారులు

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల నిర్వహణలో భాగంగా, ఎన్నికల కమిషన్ సూచనల మేరకు జిల్లాలో ఎన్నికల కోడ్ అమలుకు నోడల్ అధికారులకు నియమిస్తూ జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో ఎన్నికల ప్రక్రియను సజావుగా పూర్తి చేసేందుకు, కట్టుదిట్టంగా కోడ్‌ను అమలు చేసేందుకు ఈ ఆదేశాలను జారీ చేశారు. ఎంసిసి అమలుకు జిల్లా స్థాయి నోడల్ అధికారిగా జెడ్‌పి సిఇఒ బివి సత్యనారాయణ నియమితులయ్యారు. ఆయన జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలును పర్యవేక్షిస్తారు. ఫిర్యాదులను స్వీకరించి చర్యలు చేపడతారు. ఎంపిడిఒల ద్వారా మండల స్థాయిలో మోడల్ కోడ్‌ను అమలు చేస్తారు. మున్సిపాల్టీల్లో మోడల్ కోడ్ అమలు, పర్యవేక్షణకు అక్కడి మున్సిపల్ కమిషనర్ల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను నియమించారు. ఈ బృందంలో మున్సిపల్ కమిషనర్‌తో బాటు ఒక వీడియో గ్రాఫర్ కూడా ఉంటారు. ఈ మేరకు విజయనగరంలో కమిషనర్ పి.నల్లనయ్య, బొబ్బిలిలో కమిషనర్ ఎల్.రామలక్ష్మి, రాజాంలో కమిషనర్ జె.రామప్పలనాయుడు, నెల్లిమర్లలో కమిషనర్ కె.అప్పలరాజు నియమితులయ్యారు.

జిల్లాలో ఎన్నికల కోడ్‌ను పటిష్టంగా అమలు చేయడానికి, కోడ్ పర్యవేక్షణకు మండల స్థాయిలో ప్రత్యేక ఫ్లయింగ్ స్క్వాడ్‌లను జిల్లా కలెక్టర్ ఏర్పాటు చేశారు. ప్రతీ మండలంలో ఆయా మండల తాహసీల్దార్, స్టేషన్ హౌస్ ఆఫీసర్(పోలీసు అధికారి), ఇద్దరు పోలీసు కానిస్టేబుళ్లు, వీడియో గ్రాఫర్‌తో ఈ బృందాన్ని ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రజాసమస్యల పరిష్కార వేదిక రద్దు

ప్రజాశక్తి-విజయనగరం కోట

కలెక్టరేట్, జిల్లా పోలీసు కార్యాలయం, కార్పొరేషన్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నిక నేపథ్యంలో ఎన్నికల నిబంధనావళిని అనుసరించి రద్దు చేసినట్లు కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్, ఎస్‌పి వకుల్ జిందాల్, కమిషనర్ నల్లనయ్య తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ముగిసినంతవరకు ఇదే ఒరవడి కొనసాగుతుందని తెలిపారు. కావున ప్రజలు విషయాన్ని గుర్తించాలని తెలిపారు.

పెద్దచెరువు కాలువ ప్రక్షాళన

కమిషనర్ నల్లనయ్య

అధికారులతో చర్చిస్తున్న కమిషనర్ నల్లనయ్య

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని పెద్ద చెరువు అవుట్ ఫాల్ నుండి విస్తరించిన కాలువను ప్రక్షాళన దిశగా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. శనివారం ఉదయం ఇంజనీరింగ్, ప్రణాళిక, ప్రజారోగ్య అధికారులు, సిబ్బందితో కలిసి పలు ప్రాంతాలలో ఆయన పర్యటించారు. ముందుగా లోవర్ ట్యాంక్ బండ్ రోడ్డు వద్దనున్న పెద్ద చెరువు అవుట్ ఫాల్ స్థితిగతులను పరిశీలించారు. అక్కడి నుండి ధర్మపురి వరకు ఉన్న కాలువ పరిస్థితిని గమనించారు. కాలువ ప్రాంతం మొత్తం చూసి, వర్షపు నీరు నిలవ లేకుండా సజావుగా ప్రవహించేందుకు చేపట్టాల్సిన చర్యలు గూర్చి సమాలోచనలు జరిపారు. కాలువ మొత్తం నిడివి 5 కిలోమీటర్లుగా గుర్తించి నీటి ప్రవాహానికి అడ్డంకులు తొలగించేందుకు కాలువ విస్తరణకై ప్రాథమిక అంచనాలు రూపొందించాలని అధికారులకు సూచించారు. పద్మావతి నగర్ ప్రాంతంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. కొంతమంది టబొద్దులకు ఆయనే స్వయంగా పింఛన్లను అందజేశారు. అనంతరం గుణుపూరు పేటలోని డంపింగ్ యార్డ్ ను పరిశీలించారు. నాలుగు కిలోమీటర్ల మేర ప్రహరీ గోడ నిర్మించేందుకు సైట్ ప్లాన్ తయారుచేసి ఇవ్వవలసిందిగా టౌన్ సర్వేయర్, ప్లానింగ్ అధికారులను కోరారు. కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు రమణమూర్తి, హరిబాబు, టౌన్ సర్వేయర్ సింహాచలం, డిఇలు శ్రీనివాసరావు, ప్రసాద్, ఎఇలు, ప్రజారోగ్య పర్యవేక్షకులు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంపై సస్పెన్షన్ ఎత్తివేయాలి

పార్వతీపురం : మున్సిపాలిటీ పరిధిలో గల కొత్తవలస మున్సిపల్ ఎలిమెంటరీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడి అక్రమ సస్పెన్షన్ ఎత్తివేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మురళీమోహన్‌రావు, జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు తోట రమేష్, కె.భాస్కరరావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యకు హెచ్‌ఎంకి సంబంధం లేదని చెప్పారు. పాఠశాల తెరిచే సమయం కంటే ముందే విద్యార్థుల తల్లిదండ్రులు చేరుకున్నారని, ఈ వ్యవహారంలో హెచ్‌ఎం ప్రమేయం లేదన్నారు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి జిల్లా అధికారులు ఇలాంటి చర్యలు చేపట్టడం తగదన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో పల్లవికి బంగారు పతకం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉత్తరాఖండ్ లో జరుగుతున్న 38 వ జాతీయ నేషనల్ గేమ్స్ లో వెయిట్ లిఫ్టింగ్ విభాగంలో జిల్లాకు చెందిన ఎస్.పల్లవి 71 కేజీల కేటగిరిలో 212 కేజీల బరువు ఎత్తి బంగారు పతకం సాధించింది. పల్లవికి జిల్లా వెయిట్ లిఫ్టింగ్ కార్యదర్శి, కోచ్ చల్లా రాము, జిల్లా ఒలింపిక్ అషోషియేషన్ నాయకులు అభినందనలు తెలిపారు.

పల్లవిని అభినందిస్తున్న వెయిట్‌లిఫ్టింగ్ అసోసియేషన్ సభ్యులు

బాలోత్సవం కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

4, 5 తేదీల్లో బాలోత్సవం

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఈనెల 4,5 తేదీలలో బాలోత్సవం నిర్వహిస్తున్నట్లు విజయనగరం బాలోత్సవం కమిటీ కన్వీనర్ కె.శ్రీనివాసరావు తెలిపారు. శనివారం స్థానిక గురజాడ స్వగృహంలో బాలోత్సవం కరపత్రాల ఆవిష్కరణ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆనంద గజపతి కళాక్షేత్రంలో మంగళ, బుధవారాల్లో ఉదయం 9 గంటల నుంచి పది గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఇందులో ఆరువ తరగతి నుండి పదవ తరగతి వరకు విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహిస్తామన్నారు. సాయంత్రం ఐదు గంటల తర్వాత సాంస్కతిక ప్రదర్శనలు ఉంటాయన్నారు. హాజరైన విద్యార్థులకు మధ్యాహ్నం భోజన సదుపాయం ఉంటుందన్నారు.

పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు ఎటువంటి ఫీజు రుసుము ఉండదన్నారు. కార్యక్రమంలో అధ్యక్షులు చలం, గురజాడ ఇందిరా, సూర్యలక్ష్మి, చిన్నదేవి శ్రీనివాస్, ధవళ సర్వేశ్వరరావు, రాజు, రాము, వెంకటేష్, డప్పు శీను తదితరులు పాల్గొన్నారు.

డిజిపి హరీష్‌కుమార్‌కుమార్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఎస్‌పి వకుల్ జిందాల్

డిజిపిని కలిసిన ఎస్‌పి వకుల్

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన డిజిపిగా బాధ్యతలు చేపట్టిన హరీష్ కుమార్ గుప్తాను శనివారం జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్, ఎపిఎస్‌పి 5వ బెటాలియన్ కమాండెంట్ మాలికగార్గ్ రాష్ట్ర కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పూల మొక్కలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

3న చలో కలెక్టరేట్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న రైల్వేస్టేషన్లు, బస్టాండ్లలో రాపిడ్, వాలా పేరుతో ఆటో, టాక్సీలు పెట్టుకునేందుకు లైసెన్సులు ఇవ్వడాన్ని ఖండిస్తూ విజయదుర్గ ఆటోవర్కర్స్ యూనియన్ (ఎఐఎఫ్‌టియు) ఆధ్వర్యాన ఈనెల 3న కలెక్టరేట్ వద్ద ధర్నా చేయన్నుట్లు యూనియన్ నాయకులు రెడ్డి నారాయణరావు, అప్పలరాజు తెలిపారు. మెసానిక్ టెంపుల్ వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చలో కలెక్టరేట్ గోడపత్రికను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎటిఎస్ పేరుతో ఫిట్నెస్ సర్టిఫికేట్‌లు (బ్రేక్) జారీ చేసే విధానాన్ని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడం వలన ఆటోలు, లారీలు, ట్రాక్టర్లు, జీపులు, బస్సులు, మినీ వ్యాన్లు ఓనర్స్ కమ్ డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతారని అన్నారు. కలెక్టరేట్ వద్ద ధర్నాకు ఆటో డ్రైవర్లంతా హాజరు కావాలని కోరారు.

సకాలంలో పన్నులు చెల్లించాలి

ప్రజాశక్తి- రాజాం

పురపాలక సంఘానికి పన్నులను సకాలంలో చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024-25 సంవత్సరానికి సంబంధించిన పాత బకాయిలు వసూలు చేయడంలో సచివాలయ, కార్యాలయ సిబ్బంది నిమగ్నమయ్యారన్నారు. పన్ను చెల్లింపు దారులు, సచివాలయ సిబ్బందికి పురపాలక సంఘ సిబ్బందికి సహకరించి పన్నులు చెల్లించాలని కోరారు. ఆస్తి పన్నులు, నీటి కులాయి పన్నులు, ఖాళీ జాగా పన్నులు కట్టి తప్పనిసరిగా రసీదు పొందాలని తెలిపారు. పన్ను చెల్లింపు దారులు ఆన్‌లైన్, మున్సిపల్ ఆఫీసు, సచివాలయం వద్ద గాని చెల్లించవచ్చునని తెలిపారు.

రహదారిని పరిశీలించిన అధికారులు

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని దిబ్బలపాలెం రహదారిని పర్యాటకశాఖ అధికారులు శనివారం సాయంత్రం పరిశీలించారు. భీమిలి మండలం అన్నవరం రెవెన్యూలో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఒబరాయ్ హోటల్ నిర్మిస్తున్న విషయం తెలిసిందే. ఈ హోటల్ నుంచి విమానాశ్రయానికి వెళ్లేందుకు దిబ్బల పాలెం రహదారిని విస్తరించేందుకు సిద్ధమవుతున్న విషయం కూడా తెలిసిందే. దీనిలో భాగంగా ఈ రహదారిని భీమిలి, భోగాపురం మండలాలకు చెందిన సర్వే అధికారులతో కలిసి పర్యాటకశాఖ అధికారులు పరిశీలించారు. ఎన్ని కిలోమీటర్లు రహదారిని విస్తరించాలనే దానిపై సర్వే శాఖ అధికారులతో చర్చించారు. మండల సర్వేయర్ మధుకేశ్వరరావు, గ్రామ సర్వేర్లు అజయ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పింఛను అందజేస్తున్న ఎంపిడిఒ గంటా వెంకటరావు

డయాలసిస్ రోగికి పింఛను

ప్రజాశక్తి-విజయనగరం కోట

స్థానిక జిల్లా కేంద్రాస్పత్రిలో డయాలసిస్ రోగికి ఇన్‌ఛార్జి ఎంపిడిఒ గంటా వెంకటరావు శనివారం పింఛను అందజేశారు. గుంకలాం గ్రామానికి చెందిన దోసూరు శామ్యుల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండడంతో అతడిని కలసి యోగక్షేమాలు తెలుసుకొని రూ.10వేలు పింఛను అందించారు. గుంకలాం గ్రామం సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ శొంఠ్యాయన రమ్య తేజస్విని పాల్గొన్నారు

పాఠశాలల సందర్శన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని కె.బొద్దాం, పాటూరు గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలలను ఎంఇఒ బాలభాస్కరరావు శనివారం సందర్శించారు. పాఠశాలల్లో టాయిలెట్లు, తరగతి గదులు, విద్యార్థుల డెయిరీలు, వర్క్‌బుక్స్, కిచెన్ గార్డెన్, పాఠశాల ఆవరణను పరిశీలించారు. అనంతరం ఎంఇఒ మాట్లాడుతూ పాఠశాలకు విద్యార్థులు సమయానికి వచ్చేలా తల్లిదండ్రులకు తెలియజేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ పరిశీలనలో సిఆర్‌పిలు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైద్యాధికారి రాధికకు సన్మానం

ప్రజాశక్తి-వేపాడ

వేపాడ పిహెచ్‌సి వైద్యాధికారి ఎ.ధరణి ఉత్తమ సేవలందించి, కలెక్టర్ నుంచి ప్రశంసాపత్రం అందుకోవడంతో శనివారం ఆమెను పిహెచ్‌సి సిబ్బంది సన్మానించారు. మరిన్ని అవార్డులు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పిహెచ్‌సి సిహెచ్ఒ ఆంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పోలమ్మ ఆలయ ప్రతిష్ట

ప్రజాశక్తి-బాడంగి

మండలంలోని బాడంగి గ్రామంలో పోలమ్మ తల్లి ఆలయ ప్రతిష్ట శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి రామారావు, సర్పంచ్ కండి రమేష్, ఎంపిటిసి శ్రీను, నాయకులు అంబటి తవిటినాయుడు, గణపతి, జి.శంకర్‌రావు, బంగారు రాజు, శ్రీను, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుడికి సిఐటియు నాయకుల పరామర్శ

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం పైడిభీమవరం ఎపిటోరియా ఫార్మా(అరబిందో) పరిశ్రమలో జనవరి 30న కూలింగ్ టవర్ ఫ్యాన్ రిపేర్ చేస్తుండగా కార్మికుడు పసుమూర్తి రమేష్‌కు గాయాలయ్యాయి. ప్రమాదం విషయం తెలిసి శనివారం విజయనగరం తిరుమల హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న కార్మికుడిని సిఐటియు శ్రీకాకుళం, విజయనగరం జిల్లా ప్రధాన కార్యదర్శులు పి.తేజేశ్వరరావు, కె.సురేష్ పరామర్శించారు. కార్మికుడికి మెరుగైన వైద్యం అందించాలని యాజమాన్యాన్ని వారు డిమాండ్ చేశారు.

హుస్సేన్ కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని హుకుంపేటలో నివాసముంటున్న భవన నిర్మాణ కార్మికుడు హుస్సేన్ ఇటీవల మరణించడంతో ఆ కుటుంబానికి భవన నిర్మాణ కార్మిక సంఘం నుంచి రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న హుస్సేన్ కుటుంబాన్ని ముందుగా భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు పరామర్శించారు. సంక్షేమ బోర్డు ద్వారా ప్రభుత్వం కార్మికులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో అధ్యక్షులు కె.త్రినాథ్ , కమిటీ సభ్యులు సహజ, మేరీ రాజు, సత్తిబాబు, అప్పలరాజు, ఇబ్రహీం చేతుల మీదుగా అందించారు.



ఆర్ఒ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న శారదా మెటల్స్ ప్రతినిధులు

ఐటిఐలో ఆర్ఒ ప్లాంట్

ప్రజాశక్తి-విజయనగరం కోట

విజయనగరం ప్రభుత్వ ఐటిఐకు కొత్తవలస మండలం కంటకాపల్లికి చెందిన శారదా మెటల్స్ ఎల్లాయిస్ కంపెనీ ప్రతినిధులు సిఎస్ఆర్ నిధులతో వాటర్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కంపెనీ డిజిఎం హెచ్. హనుమంతరావు, అసిస్టెంట్ మేనేజర్ జి.శంకరరావు పాల్గొన్నారు. విద్యార్థులకు కెరీర్ గైడెన్సుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐటిఐ ప్రిన్సిపాల్ టివి గిరి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో కార్మికుడు మృతి

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఇనుప చువ్వాకు కరెంట్ వైర్ తగిలి భవన నిర్మాణ కార్మికుడు కన్నూరి ఆదినారాయణ (40) మృతి చెందాడు. మెరకముడిదాం మండలం ఇప్పలవలసకు చెందిన ఆదినారాయణ విజయనగరంలోని ముడిదాంలో నిర్మితమవుతున్న ఓ అపార్ట్మెంట్‌లో పనులు చేసేందుకు వచ్చాడు. పరంజిపై ఉన్న ఇనుప చువ్వను తొలగిస్తుండగా పక్కనే ఉన్న విద్యుత్తు వైర్‌కు తగిలి షాక్‌కు గురై పై నుంచి కిందపడిపోయాడు. ఈఘటనలో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. రూరల్ స్టేషన్ ఎస్ఐ అశోక్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. అతని భార్య గౌరీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చురుగ్గా విమానాశ్రయ రహదారి పనులు

- ప్రస్తుతం 6కిలోమీటర్ల వరకే భూములు లభ్యం
- వాహనాలు అటూ ఇటూ వెళ్లేలా పలుచోట్ల అండర్ పాస్‌లు
- 200 అడుగుల వెడల్పుతో నాలుగు లైన్ల రహదారి

చురుగ్గా సాగుతున్న రన్‌వే నిర్మాణం

ప్రజాశక్తి - భోగాపురం

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి వెళ్ళేందుకు అవసరమైన అప్రోచ్ రోడ్డు రహదారి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రస్తుతానికి 6కిలో మీటర్లు వరకు ఎటువంటి ఇబ్బందులూ లేకపోవడంతో చురుగ్గా సాగుతున్నాయి. మిగతా రహదారికి సంబంధించి పరిహారం విషయంలో విశాఖ భూసేకరణ ట్రిబ్యునల్ కోర్టులో కేసులు కొనసాగుతున్నాయి. విమానాశ్రయానికి జాతీయ రహదారి నుంచి వెళ్ళేందుకు ఉప్పాడపేట జంక్షను వద్ద నిర్మించనున్న ట్రంపెట్ నుంచి వెళ్లాలి. కానీ ఏ.రావివలస రెవెన్యూ పరిధిలో ఉన్న ఈ ట్రంపెట్ సమీపంలో ఇంకా రైతులకు పరిహారం ఇవ్వకపోవడంతో దీనికి 500 మీటర్లు దూరం నుంచి ప్రస్తుతం రోడ్డు పనులు సాగుతున్నాయి. అక్కడ నుంచి ఆరు కిలో మీటర్లు వరకు ఎటువంటి ఇబ్బందులూ లేకపోవడంతో ఇటీవలి ఈ రహదారి నిర్మాణ పనులు ప్రారంభించారు.

200 అడుగుల వెడల్పుతో రహదారి

జాతీయరహదారి నుంచి 500 మీటర్లు దూరం విడిచిపెట్టి అక్కడ నుంచి విమానాశ్రయానికి వెళ్ళేందుకు ప్రస్తుతం రహదారి పనులు జరుగుతున్నాయి. కెపిసి అనే నిర్మాణ సంస్థ ఈ పనులను చేపడుతోంది. 22 మీటర్లు అంటే 200 అడుగుల వెడల్పుతో నాలుగులైన్లతో ఈ రహదారి పనులు జరుగుతున్నాయి. స్థానికుల వాహనాలు అటూ ఇటూ వెళ్ళే విధంగా అక్కడక్కడ అండర్‌పాస్‌లను సైతం నిర్మిస్తున్నారు. ఏ.రావివలస జగనన్న కాలనీ, గూడెపువలస మూడుగుళ్ళు సమీపంలో, పలుచోట్ల అండరర్ పాస్‌లు నిర్మాణం జరుగుతున్నాయి. ప్రస్తుతం మట్టి పనులు జోరందుకున్నాయి. అవసరమైన చోట కల్వర్టులను సైతం నిర్మిస్తున్నారు. ఇదే రహదారికి గూడెపువలస రెవెన్యూ పరిధిలో 20 ఎకరాలకు రైతుల నుంచి అనుమతి లభించింది. ఇటీవలి ఈ 20 ఎకరాలకు అవార్డ్ కూడా పాస్ చేశారు. విశాఖ ట్రిబ్యునల్ కోర్టులో కేసు పరిష్కారం కావడంతో త్వరలో రైతుల ఖాతాలోకి పరిహారం పడుతుందని గూడెపువలస గ్రామ సర్పంచ్ మట్టా ఆయ్యప్పరెడ్డి సమక్షంలో రైతులకు ఆర్‌డిఒ దాట్ల కీర్తి చెప్పడంతో రైతులు సమ్మతించారు. ఈ 20 ఎకరాల్లో కూడా అప్రోచ్ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు. కంచేరు రెవెన్యూ పరిధిలోని బైరెడ్డిపాలెం, ఏరావివలస రెవెన్యూ పరిధిలో ఇంకా కోర్టు కేసులు తేలకపోవడంతో రైతులు రహదారి నిర్మాణానికి అనుమతించడం లేదని, ఇవి కూడా త్వరలో తేలిపోతాయని అధికారులు చెబుతున్నారు.

గ్రామస్థాయి నుంచి బలోపేతం

వైసిపి శ్రేణులకు బెల్లాన, బొత్స పిలుపు

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపి బెల్లాన, మాజీ ఎమ్మెల్యే అప్పలనర్సయ్య

ప్రజాశక్తి-గజపతినగరం

వైసిపి అనుబంధ కమిటీలను గ్రామస్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు బలోపేతం చేయాలని మాజీ ఎంపి బెల్లాన చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. శనివారం స్థానిక వైసిపి కార్యాలయంలో అనుబంధ కమిటీ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిడిపి సూపర్ సిక్స్ చూపించి అందరితో ఓట్లు వేయించుకొని, రాష్ట్ర ప్రజలందరినీ నిలువునా మోసం చేసిందన్నారు. సర్పంచులను, ఎంపిటిసిలను కాదని, అధికార మదంతో అధికారులను భయపెట్టి, టిడిపి కార్యకర్తలకు లబ్ధి చేకూర్చే విధంగా ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్నారని ధ్వజమెత్తారు. నిరుద్యోగ భృతి, వాలంటీర్లకు రూ.10 వేలు, మహిళలకు నెలకు రూ.1500 ఇస్తామని దగా చేసిన దొంగల ప్రభుత్వం టిడిపి సర్కారని దుయ్యబట్టారు. అప్పులతో రాష్ట్రాన్ని శ్రీలంకగా మార్చేస్తున్నారని పెద్ద ఎత్తున గత వైసిపి ప్రభుత్వంపై గ్లోబల్ ప్రచారం చేశారని, ఇప్పుడు మీరు చేసిన రూ.1.12 లక్షల కోట్ల అప్పులు ఏమయ్యాయని నిలదీశారు. అమరావతి పేరుతో 40 వేల కోట్ల రూపాయల ఖర్చు చేస్తూ సగానికి పైగా చంద్రబాబు తనయుడు లోకేష్ జేబుల్లోకి మళ్ళించుకుంటున్నారని ముఖ్యమంత్రిపై విమర్శలు గుప్పించారు. ఎన్నికల సమయంలో భీమసింగి సుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తామన్న హామీ ఏమైందని స్థానిక మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ని ప్రశ్నించారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇచ్చామని ప్రగల్భాలు పలుకుతున్న మంత్రికి నియోజకవర్గంలోని ఓలం కంపెనీని కొనసాగిస్తూ, లేదంటే ఆ స్థానంలో వేరే కంపెనీని ఏర్పాటు చేసి ఉద్యోగాలు కల్పించాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి గార తవుడు, వైసిపి నాయకులు కరణం ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు పరిశీలిస్తున్న ఎంపిడిఒ సూర్యనారాయణ

ఉపాధి పనుల పరిశీలన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని గుడివాడ గ్రామంలో ఉపాధి హామీ పనులను ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడారు. కొలతల ప్రకారం చేస్తే కూలి గిట్టుబాటు అవుతుందని చెప్పారు. తప్పుడు మస్తర్లు వేసి, వేతనాలు పొందినట్లు ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. కార్యక్రమంలో ఫీల్డ్‌అసిస్టెంట్, మేట్లు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ పరిశీలన

మండలంలోని సోంపురం, జాకేరు, కరకవలస గ్రామాల్లో సామాజిక పింఛన్ల పంపిణీని ఎంపిడిఒ సూర్యనారాయణ పరిశీలించారు. సిబ్బంది పనితీరుపై ఆయన సంతృప్తి వ్యక్తంచేశారు.

రాజాం : మండలంలోని శాంపురంలో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపిడిఒ శ్రీనివాస్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కూలీల హాజరు రిజిస్టర్‌ను తనిఖీ చేసి స్వయంగా హాజరు వేశారు. ఉపాధి కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వేసవి ఎండల తీవ్రత పెరుగుతున్నందున పని ప్రదేశంలో కూలీలు సేద తీరేందుకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని, కొలతల ప్రకారం పని వివరాలను పక్కాగా రికార్డుల్లో నమోదు చేయాలని ఆదేశించారు. కూలి డబ్బులు సక్రమంగా బ్యాంకు ఖాతాలో పడుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. పని ప్రదేశంలో ఏమైనా ఇబ్బందులు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని కూలీలకు సూచించారు.

డివిజిని కలిసిన నిమ్మక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మాజీ ఎమ్మెల్యే నిమ్మక జయరాజ్ రాష్ట్ర ఎస్‌టి కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు ను విజయనగరం లోని చైర్మన్ క్యాంప్ కార్యాలయంలో శనివారం కలిసారు. ఈ సందర్భంగా ఆయన పలు గిరిజన సమస్యలను డాక్టర్ డివిజి శంకరరావు దృష్టికి తీసుకెళ్లారు. గిరిజన గ్రామాల్లో తాగునీరు, రహదారుల సమస్యలు వెన్నాడుతున్నాయన్నారు. ప్రధానంగా అత్యవసర వైద్య సహాయం అవసరమైన సందర్భంలో ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొనడంతో పాటు ప్రాణపాయ పరిస్థితులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే నిమ్మక జయరాజ్ తోపాటు గిరిజన ఉద్యోగి మండంగి బాలా కుమారి చైర్మన్‌ను కలిసారు.

ఫీజుపోరు పేరుతో ధర్నాకు పిలుపు సిగ్గుచేటు

ప్రజాశక్తి-విజయనగరంకోట

వైసిపి ప్రభుత్వంలో రూ.2వేల కోట్లు బకాయిలు పెండింగ్ పెట్టి, విద్యార్థుల భవిష్యత్ నాశనం చేసిన ఘనత జగన్ రెడ్డిదని టిఎన్ఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బెవర భరత్ అన్నారు. శనివారం అశోక్ బంగ్లాలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్‌డిఎ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 8 నెలలకే రూ.788 కోట్లు విడుదల చేసి,9 లక్షల మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇచ్చిన ఘనత టిడిపిదేనని అన్నారు జగన్ రెడ్డి ఉనికి కోసమే ఫీజు పోరు కార్యక్రమం చేపడుతున్నారని తెలిపారు.

సర్వే సందేహాల నివృత్తికి ఎక్స్‌పర్ట్ సెల్ ఏర్పాటు : జెసి

ప్రజాశక్తి-విజయనగరం కోట

భూముల రీసర్వేకు సంబంధించి భూముల యజమానులకు వచ్చే సందేహాలను నివృత్తి చేసేందుకు జిల్లా సర్వే భూరికార్డుల కార్యాలయంలో ఒక ఎక్స్‌పర్ట్ సెల్ ను ఏర్పాటు చేసినట్టు జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్ తెలిపారు. డిప్యూటీ ఇన్స్పెక్టర్ స్థాయి అధికారిని ఈ సెల్ ఇన్‌ఛార్జిగా నియమించామన్నారు. ఎక్స్‌పర్ట్ సెల్ అధికారిగా సర్వే భూరికార్డుల శాఖకు చెందిన ఎ.మన్మధరావును నియమించామని, 9441633116 మొబైల్ నెంబరులో ఆయన కార్యాలయ పనిదినాల్లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో వుంటూ సర్వే విభాగం క్షేత్రస్థాయి సిబ్బందికి, భూయజమానులకు రీసర్వేపై వచ్చే సందేహాలను నివృత్తి చేస్తారని తెలిపారు. ఆయనకు సహాయకులుగా డిప్యూటీ సర్వేయర్ ఎన్.వి.ఆర్.నరేష్‌రెడ్డి నియమించామని పేర్కొన్నారు. జిల్లాలోని భూ యజమానులు, సర్వే సిబ్బంది ఈ ఎక్స్‌పర్ట్ సెల్ సేవలను వినియోగించుకొని తమ సందేహాలు నివృత్తి చేసుకోవాలని సూచించారు.

బాలకృష్ణ ఫ్యాన్స్ కేక్ కటింగ్

విజయనగరం కోట : ప్రముఖ సినీ నటుడు నందమూరి బాలకృష్ణకు పద్మభూషణ్ అవార్డు వచ్చిన సందర్భంగా జిల్లా నందమూరి అభిమాన సంఘం ఆధ్వర్యంలో శనివారం ఎన్‌సిఎస్ థియేటర్ వద్ద కేక్ కట్ చేసి అభిమానులు సంబరాలు చేసుకున్నారు. ముఖ్య అతిధులుగా హాజరైన టిడిపి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు , ఎన్‌సిఎస్ థియేటర్ యజమాని శ్రీనివాస్ హాజరయ్యారు.

తాగునీటి సౌకర్యం కల్పించాలి

ప్రజాశక్తి- మెంటాడ

గిరిజన గ్రామాలలో తాగునీటి సదుపాయం కల్పించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి పాలూరి రమణమ్మ ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. శనివారం మండలంలోని ఆంద్ర గ్రామంలో సవరవిల్లి అలివేణి అధ్యక్షతన జరిగిన సభలో ఆమె మాట్లాడారు. ఎగువ మిర్తివలస, దిగువ మిర్తివలస, కుంబివలస, సవరవిల్లి, శీలవలస గ్రామాల్లో తాగునీటి సౌకర్యం లేక ఊటబావుల్లో కలుషితమైన నీటిని వినియోగిస్తూ గిరిజనులు రోగాల బారిన పడుతున్నామని తెలిపారు. ఈ విషయంలో గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణి, ఎంపిడిఒ భానుమూర్తికి వినతిపత్రాలను సమర్పించి రెండు నెలలు కావస్తున్నా ఇప్పటికీ పట్టించుకునే దాఖలాలు కానరావడం లేదన్నారు. తక్షణమే ఆయా గిరిజన గ్రామాలకు రక్షిత మంచినీటి ట్యాంకులు నిర్మించి, తాగునీటి కొళాయిలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా నాయకులు వి.లక్ష్మి, రాకోటి హరికృష్ణ వేణి, నాయకులు సిహెచ్.కృష్ణవేణి, సన్యాసమ్మ, గెద్ద రవణమ్మ, చింతగడ చినతల్లి, అడవిరాజు, బంగారి సింహాచలం, పోయిరి గైరమ్మ, చింత సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

చిత్తడి నేలల పరిరక్షణ మన బాధ్యత

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

భూమిపై ప్రాణికోటి మనగడకు చిత్తడి నేలలే మూలమని డివిజన్ ఉప విద్యా శాఖదికారి మోహన రావు పేర్కొన్నారు. ఫిబ్రవరి 2 న ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ఎన్‌జిసి డైరెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని పలు పాఠశాలల్లో శనివారం అవగాహన సదస్సులు ఏర్పాటు చేశారు. పలు పాఠశాలల్లో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోహన రావు మాట్లాడుతూ నీటి వనరులకు, మంచినీటికి మూలాలుగా ఉన్న చిత్తడి నేలలు భూమి ఉపరితలం నుంచి వ్యర్థాలను వడపోస్తాయన్నారు వీటిని పరిరక్షించాలనే ఉద్దేశంతో ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 2న వరల్డ్ వెట్ ల్యాండ్ డేను నిర్వహిస్తారని తెలిపారు. మంచి నీటి సరస్సులు, ఉప్పునీటి సరస్సులు, మడ అడవులున్న తీర ప్రాంతాలన్నీ చిత్తడి నేలలేనని అన్నారు. అలల తాకిడికి దెబ్బ తినకుండా ఈ చిత్తడి నేలలు అడ్డు కట్ట వేస్తాయన్నారు. అరుదైన మొక్కలకు, పక్షులకు, జంతువులకు, చేపల గుడ్లు పెట్టడానికి ఈ చిత్తడి నేలలు చాలా అనుకూలమని తెలిపారు. వీటిని కాపాడు కోవాలనే అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నా మన్నారు. అనంతరం వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్‌పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యా యులు నాగమణి , పూర్ణచంద్రరావు, జిల్లా ఎన్‌జిసి కోఆర్డినేటర్ బూరి వేణుగోపాల రావు, ఎకో క్లబ్ కన్వీనర్ సూర్య కళ, సైన్స్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆతవ జంక్షన్ రోడ్డుపై రాస్తారోకో నిర్వహిస్తున్న గ్రామస్తులు

రోడ్డు పనులు చేపట్టాలని రాస్తారోకో

ప్రజాశక్తి-వేపాడ

ఆతవ గ్రామానికి రహదారి పనులు ప్రారంభించాలని రాళ్లు తేలిన రహదారిపై ఆ గ్రామస్తులు శనివారం రాస్తారోకో చేపట్టారు. రోడ్డు పనులు చేపట్టాలని కోరుతూ గ్రామస్తులు చేపడుతున్న నిరసన ఆరో రోజూ కొనసాగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు చల్ల జగన్ మాట్లాడుతూ రాళ్లు తేలిన రహదారితో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోక పోవడం దారుణమన్నారు. ఎన్నికల్లో హామీనిచ్చిన ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారికి రోడ్డు సమస్య పట్టడం లేదని విమర్శించారు. వెంటనే రోడ్డు నిర్మాణాన్ని ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆతవ గ్రామ నాయకులు కెర్రు దేముడు, ఆతవ నాగరాజు, డప్పు రాజు, ఆతవ సింహాచలం, జి.అవతారం, ఎల్.కోటేశ్వరరావు, జి.సాంబమూర్తి, మహేశ్వరరావు, బంగారయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులకు హాజరు కావాలి : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లాలో జాతీయ గ్రామీణ ఉపాధి చట్టంలో నమోదు చేసుకున్న వేతనదారులంతా తమ గ్రామాల్లో వెంటనే పనులకు హాజరు కావాలని జిల్లా కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోరారు. జిల్లాలోని 27 మండలాల్లో గల 775 గ్రామ పంచాయతీల్లోనూ పనులను ప్రారంభించామని, ఈ పనుల్లో పాల్గొనడం ద్వారా ప్రతిరోజూ రూ.300 వేతనం పొందేలా పని చేయాలని సూచించారు. ఉపాధి పనుల్లో భాగంగా వ్యవసాయ అనుబంధ పనులైన ఫారం పాండ్లు, బౌండరీ ట్రెంచ్ లు, రింగ్ ట్రెంచ్‌లకు ప్రాధాన్యత ఇస్తూ చిన్న సన్నకారు రైతుల భూముల్లో యీ పనులు చేయించుకోవచ్చన్నారు. చిన్న సన్నకారు రైతులంతా ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ భూముల్లో నీటి నిల్వ కందకాలు తవ్వుకోవాలన్నారు. దీంతో పాటు చిన్నకారు రైతుల మెట్ట భూముల్లో పండ్లతోటల పెంపకం, పట్టుపురుగుల పెంపకం, గడ్డి పెంపకం, పూల పెంపకం పనులు కూడా చేసుకోవచ్చన్నారు. జిల్లాలో పనుల సీజను మొదలైనందున వేతనదారులు ఆయా గ్రామాల్లో నిర్వహిస్తున్న పనుల్లో పాల్గొని అధిక వేతనాలు పొందవచ్చని డ్వామా పథక సంచాలకులు శారదాదేవి పేర్కొన్నారు.

ప్రజలను తప్పదోవ పట్టించడం తగదు

మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి-గజపతినగరం

వైసిపి నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం తగదని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసిపి నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టించి రాజకీయంగా లబ్ధి పొందాలని చూస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా సూపర్ సిక్స్ హామీలు అమలు చేసేందుకు సమయం పడుతుందన్నారు. అంతవరకు ప్రతిపక్ష నాయకులు ఆగలేకపోతున్నారని, ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. గత వైసిపి ప్రభుత్వం ఏడు నెలల కాలంలో ఏ ఒక్క హామీని అమలు చేయలేక పోయిందన్నారు. రూ.2 వేల పింఛను రూ.3 వేలు చేసేందుకు ఐదేళ్ల పట్టిందని విమర్శించారు. ప్రజలకు నాణ్యమైన మద్యం తక్కువ ధరకు అందిస్తున్నామని, గత ప్రభుత్వం నాసిరకం మద్యంతో ప్రజల ఆరోగ్యాలను గుల్ల చేసిందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపిలు మక్కువ శ్రీధర్, గంట్యాడ శ్రీదేవి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి పివివి గోపాలరాజు, వైకుంఠం ప్రదీప్ కుమార్, మండల అధ్యక్షులు చప్ప చంద్రశేఖర్, కొండపల్లి భాస్కర్ నాయుడు, కోరాడ కృష్ణ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ రామ్మోహనరావు

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి-బొబ్బిలి

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్‌డిఒ రామ్మోహనరావు హెచ్చరించారు. శనివారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో పిసి అండ్ పిఎన్‌డిటి చట్టంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగ నిర్ధారణ పరీక్షలలో ఆడపిల్లగా తేలితే అబార్షన్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లింగ నిర్ధారణ పరీక్షలు, అబార్షన్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆడపిల్లల పట్ల వివక్షత చూపొద్దని కోరారు. ఆడపిల్లలను రక్షించేందుకు పని చేయాలని ఐసిడిఎస్, వైద్య ఆరోగ్య శాఖ, పోలీసు సిబ్బందికి సూచించారు. సమావేశంలో వైద్యులు సంతోషికుమారి, రాజారాణి, ఎం.సంధ్య, ఎస్ఐ రమేష్, అంగన్వాడీ సూపర్‌వైజర్ సుబ్బలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జాతీయస్థాయి వర్క్‌షాప్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మహారాజా స్వయం ప్రతిపత్తి కళాశాలలో జరిగిన రెండు రోజుల జాతీయ స్థాయి సైన్స్ అకాడమి లెక్చర్ వర్క్ షాప్‌లో శనివారం 'గణిత విశ్లేషణలో అంశాలు' అనే అంశం పై చెన్నై మేథమెటికల్ ఇనిస్టిట్యూట్‌కు చెందిన ప్రొఫెసర్ బి.వి.రావు, కృష్ణ హనుమంతు, మనోజ్ కుమిని మాట్లాడారు. నిత్య జీవితంలో గణిత శాస్త్రంలో ప్రాముఖ్యతను సంచరించుకుందని పదార్థాలను కొలవడానికి, వాటి పరిమాణం, వివిధ భాగాల నిష్పత్తిని తెలసుకోవడానికి, బేకింగ్ కోసం ఉష్ణోగ్రతలను కొలవడానికి గణితశాస్త్రం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. మేథ్‌మెటికల్ సైన్సులో డిగ్రీ చేసిన విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో మంచి జీతాలతో ఉద్యోగం పొందుతారని చెప్పారు. కార్యశాలలో ఎంఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సాంబశివరావుతో పాటు, గణిత శాస్త్ర విభాగాధిపతి ఎస్. సూరిబాబు, సీనియర్ అధ్యాపకులు సి.ఎస్ కె. ఉమాశంకర్, ఎన్. ధర్మారావు, పి.ఊర్మిళ, స్వాతి, డాక్టర్ టి శ్రీదేవి, స్వామి నాముడు డి.రమేష్, బి.ఝాన్సీ, ఎయు రిటైర్డు ప్రొఫెసర్ జిసిరావు పాల్గొన్నారు.

3న సామూహిక అక్షరాభ్యాసాలు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

స్థానిక శ్రీసరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో ఈ నెల 3వ తేదీన సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ పాఠశాల ప్రధానాచార్యులు ఎం శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు తెలిపారు. సకల విద్యలకు ఆది దేవత అయిన సరస్వతీ దేవి ఆవిర్భవించిన పవిత్ర దినం మాఘమాస పంచమి సందర్భంగా ఉదయం 9.45 గంటలకు ఈ కార్యక్రమాలు జరిపిస్తామన్నారు. అక్షరాభ్యాసానికి అవసరమైన సామాగ్రిని తల్లిదండ్రులు తెచ్చుకోవాలని ఆయన చెప్పారు.